క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం స్వామి, అమ్మవార్ల పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

సీఎంపై దాడి హేయం

• డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి

కోవూరు : విజయవాడలో జరిగిన బస్సుయాత్రలో టీడీపీ వర్గీయులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడం అత్యంత హేయమని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. మేమంతా సిద్ధం బస్సు యాత్ర విజయవంతంగా సాగుతుండడంతో ప్రతిపక్ష నేతలు ఓర్వలేక ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నట్లు తెలిపారు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి నిందితులను శిక్షించాలని కోరారు.

మునగాల మేఘనకు డాక్టరేట్



మునగాల మేఘన

నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన మునగాల మేఘన ఐఐటీ బాంబే నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నట్లు నెల్లూరులో శనివారం ఆమె తెలిపారు. పీహెచ్‌డీ కోసం జపాన్‌లో ఇండో జపాన్ కొలాబరేషన్‌లో ప్రతిష్టాత్మక జేఏసీఏ స్కాలర్‌షిప్‌కి ఎంపిక కావడంతోపాటు ఐఐటీ బాంబేలో పీహెచ్‌డీ కోర్సులో ప్రవేశం పొందారు. ఐఐటీ బాంబే కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ యోగేశ్వరశాస్త్రి పర్యవేక్షణలో 'సస్టెయినబుల్ వొలరైజేషన్ ఆఫ్ సుగారో ఇండస్ట్రీ వేస్ట్ త్రూ సర్క్యులర్ ఎకానమి అప్రోచెస్' అనే అంశంపై ఐఐటీ బాంబేకి ఆమె పరిశోధన వ్యాసం సమర్పించి పీహెచ్‌డీ అందుకున్నారు. ఆమె శాస్త్ర యూనివర్సిటీ తిరుచ్చిలో ఇంజినీరింగ్, హైదరాబాద్ ఐఐటీ నుంచి ఎంటెక్ పూర్తి చేశారు. మేఘన తండ్రి రంగారావు కొత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడు, తల్లి విజయనిర్మల నెల్లూరులోని కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు.

ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



పోలీసు అధికారులకు సూచనలిస్తున్న ఆర్వో వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా వివిధ ఏర్పాట్లను నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి అవసరమైన రక్షణ చర్యలు, బారికేడ్లు, పోలీసుల చెకింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు, ఇతరులు సంచరించకూడని నిషేధిత ప్రాంతాల మార్కింగ్ తదితర ఏర్పాట్లను డీఎస్పీ శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రుషుల సేవనం.. రాక్షస సంహారం

నెల్లూరు(బృందావనం): అరణ్యవాసంలో రామలక్ష్మణులు ఆశ్రమాలను సందర్శిస్తూ రుషులను గురుభక్తితో సేవించడంతోపాటు రాక్షసులను సంహరించి లోకరక్షణకు ఎంతో కృషి చేశారని ప్రముఖ వైద్యుడు, ఉపన్యాసకులు డాక్టర్ సింగరాజు శ్రీరామకృష్ణప్రసాద్‌రావు తెలిపారు. పద్య సారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధి పీటీజీ టవర్స్‌లో జరుగుతున్న శ్రీరామ కథా తరంగిణి సప్తాహంలో భాగంగా మూడో రోజు శనివారం రాత్రి అరణ్యకాండంపై ఆయన ఉపన్యసించారు. అరణ్యకాండంలో అగస్త్యాశ్రమ సందర్శన, జటాయువు దర్శనం, పంచవటిలో సీతారాముల వనవాసం, శూర్పణఖ పరాభవం, సీతాపహరణం తదితర ఘట్టాలను వివరించారు. సభాపోషకులుగా కె.గోవిందాచార్యులు, రమాదేవి దంపతులు వ్యవహరించారు. ఉపన్యాసకులు శ్రీరామకృష్ణప్రసాద్‌రావును సత్కరించారు. కార్యక్రమంలో పద్య సారస్వత్ పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు, కోశాధికారి సూరం చంద్రశేఖరం, శతావధాని కొండపి మురళీకృష్ణ, కోట శ్రీరామమూర్తి, అవధాని కోట రాజశేఖరం, శివరాం, స్వామి సమయానంద, చక్కిరాల జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి



మంత్రి కాకాణితో ఆప్యాయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు



ప్రచారంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గాన్ని కోట్లాది నిధులతో రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా అభివృద్ధి చేశాం.. ప్రజలు మరోసారి ఆశీర్వదించాలి అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. మండలంలోని చవటపాళెం, పాలిచెర్లపాడు, కందలపాడు, పులితీగలపాడు గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, మహిళలు కాకాణికి అపూర్వ స్వాగతం పలికారు. గ్రామాల్లోని ప్రతి కాలనీలో ఎన్నికల ప్రచారం సాగింది. పలుచోట్ల వృద్ధులు, మహిళలతో వైఎస్ జగన్ పరిపాలన గురించి మాట్లాడారు. ఆయన అధికారంలోకి వచ్చాక తమ కుటుంబాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని, మళ్లీ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని మహిళలు, వృద్ధులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో సర్వేపల్లి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామని చెప్పారు. గతంలో ఎవరికీ సాధ్యంకాని విధంగా కోట్లాది నిధులతో సీసీరోడ్లు, తాగునీటి పథకాలు, నాడు–నేడు పథకం కింద పాఠశాలల అభివృద్ధి, ఇంటింటికీ తాగునీటి కుళాయిల ఏర్పాటు, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. గత టీడీపీ పాలనలో వ్యవసాయశాఖ మంత్రిగా సోమిరెడ్డి రైతులను అడ్డంపెట్టుకుని ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడ్డాడని విమర్శించారు. మిల్లర్ల వద్ద ముడుపులు తీసుకుని రైతులకు మద్దతు ధర కల్పించలేదని, రైతు రథం, నీరు–చెట్టు పథకాల పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నాడన్నారు. ఈ ప్రభుత్వంలో తాను వ్యవసాయశాఖ మంత్రిగా రైతులకు అన్నివిధాలా అండగా నిలిచినట్లు తెలియజేశారు. మద్దతు ధర కంటే రైతులు అదనంగా కల్లాల్లోనే ధాన్యం అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజానాయుడు, వెంకటకిష్టయ్యనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, వెంకటేశ్వర్లు, భాస్కర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ బీద, ఎమ్మెల్యే ప్రసన్న, ఎమ్మెల్సీ కల్యాణ్

కోవూరు : ఐదేళ్ల సంక్షేమ పాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష టీడీపీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్న నివాసంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి సమక్షంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి నుంచి జింగిరి చినబాబు, కత్తెర అనిల్, ఆకుల పెంచలయ్య, పోకల శ్రీనివాసులు ఆధ్వర్యంలో 200 మంది, నాగమాంబాపురం నుంచి ఒంటేరు శ్రీహరి, గోపసాన్ని పెంచలయ్య, షేక్ ముక్తియర్, పులి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో 80 మంది శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

• ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని హరిజనవాడకు చెందిన వంద మంది టీడీపీని వీడి ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మునలి లక్ష్మయ్య, ఎం.రామయ్య, ఎన్.మహేష్, ఎం.చిన్న, ఎన్.శ్రీలత ఉన్నారు.

• రామతీర్థం పంచాయతీలోని శివాలయం గిరిజనకాలనీ నుంచి కె.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కె.అంకోజీ, ఏలూరి సుబ్బారావు ఆధ్వర్యంలో 60 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గౌరీపురం నుంచి వార్డ్ మెంబర్, టీడీపీ సీనియర్ నేత ఊటుకూరు నాగూరయ్య తెలుగుదేశం పార్టీని వీడి అవుల సుధీర్, నువ్వూరు నరేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే ప్రసన్న పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో ఎంపీ, ఎమ్మెల్యే

నందివాహనంపై శివపార్వతుల విహారం



మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలులోని సంగమేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులైన సంగమేశ్వరుడు, కామాక్షితాయి(శివపార్వతులు) శుక్రవారం అర్ధరాత్రి నందివాహనంపై భక్తులకు కనువిందు చేశారు. అర్చకుడు సాయిశర్మ శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉత్సవర్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి నంది వాహనంపై కొలువుదీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. అడుగడుగునా గ్రామస్తులు స్వామివారికి కొబ్బరికాయలు, పండ్లు, పూలు నైవేద్యంగా సమర్పించి మంగళహారతులు పట్టారు. శనివారం మధ్యాహ్నం వరకు గ్రామోత్సవం కొనసాగింది. చిట్టమూరు సురేందర్ రెడ్డి, సునంద దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన డీజే, మంగళ వాయిద్యాలు, తప్పెట్లు భక్తులను అలరించాయి.

'నవోదయ'కు రామాపురం విద్యార్థిని



రజ్వీక

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని కె.రజ్వీక నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో చేరికకు ఇటీవల జిల్లాస్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇందులో రజ్వీక ప్రతిభ కనబరిచి అర్హత సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం గౌస్‌బాషా, ఉపాధ్యాయినులు సి.మాధవి, పీఆర్.సుహాసినీ శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఓటు వేయడం సామాజిక బాధ్యత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గిరిజనులకు అవగాహన కల్పించిన స్వీప్ అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఓటుహక్కు వినియోగించుకోవడం పౌరుల సామాజిక బాధ్యత అని కోవూరు నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి వెంకటరత్నం అన్నారు. మండలంలోని పంచేడు వెస్ట్ గిరిజన కాలనీలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈసీ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. కార్యక్రమంలో స్వీప్ సభ్యులు రవిశంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన సిలిండర్ల లారీ



హైవేపై పడిపోయిన సిలిండర్‌లు

మనుబోలు : గ్యాస్ సిలిండర్ల లోడ్‌తో వెళ్తున్న లారీ శనివారం మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద అదుపుతప్పి పడిపోవడంతో సిలిండర్‌లు హైవేపై పడిపోయాయి. నెల్లూరు వైపు నుంచి సిలిండర్లతో గూడూరు వైపు వెళ్తున్న లారీ మండల పరిధిలోని హైవేపై పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఉంచిన బారికేడ్లను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి పడిపోయింది. దీంతో లారీలో ఉన్న భారీ గ్యాస్ సిలిండర్‌లు రోడ్డుపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సిలిండర్‌లు ఎక్కడ లీకవుతాయోనని వాహనదారులు ఆందోళన చెందారు. అయితే ఎక్కడా లీకులు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎస్సై అజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



మనుబోలు : విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

మనుబోలు : ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను శనివారం కళాశాలలో అధ్యాపకులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు 66 మందికి గానూ 56 మంది (85 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. కాగితాలపూరు గ్రామానికి చెందిన ఎంపీసీ విద్యార్థిని బోలా శ్రావ్య వెయ్యి మార్కులకు 977 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం సాధించారని తెలిపారు. బైపీసీలో ఆర్.నీలిమ 893 మార్కులతో రెండో స్థానంలో, సీఈసీలో సుమలత 784 మార్కులతో మూడో స్థానంలో నిలిచినట్లు వివరించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 55 మందికి 35 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలియజేశారు. వీరిలో ఎంపీసీ విద్యార్థిని ప్రవళిక 470 మార్కులకు 394, జాహ్నవి 440 మార్కులకు 365 మార్కులు సాధించి మొదటి రెండు స్థానాల్లో నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో శరత్‌బాబు, మల్లికార్జున, రమేష్, శ్రీధర్, వేణుగోపాల్‌రెడ్డి, బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

• **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం శనివారం సత్కరించి, అభినందించారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ గైనకాలజిస్ట్ లావణ్య, పీడియాట్రీషియన్ అనిల్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలంటే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వారికి ప్రజలే బుద్ధి చెబుతారు

• ఎంపీ బీద మస్తాన్‌రావు

కోవూరు : వైఎస్సార్‌సీపీ అధిష్టానం నెల్లూరు సిటీలో ఒక ముస్లిం మైనార్టీకి, కందుకూరులో బీసీకి టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని వ్యక్తులు కోవూరు నియోజకవర్గానికి వచ్చారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు చెప్పారు. నెల్లూరులోని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. కోవూరు నియోజకవర్గం నల్లపరెడ్డి అడ్డా.. అని ప్రసన్న విజయం తథ్యమన్నారు. ఈ ఐదేళ్లు ఎమ్మెల్యే ప్రసన్న ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమయ్యారని, అందువల్లే ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ప్రజలు ప్రతిపక్ష నేతలతో జాగ్రత్తగా ఉండాలని కోరారు. నిన్నటి వరకు వలంటీర్లను విమర్శించిన చంద్రబాబు నేడు వారికి రూ.10 వేలు ఇస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వేమిరెడ్డి దంపతులు ప్రజలను డబ్బుతో కొనలేరని, ఇది గుర్తించి నడుచుకోవాలని హితవు పలికారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు



విడవలూరు : ప్రజలను పలకరిస్తున్న రజత్‌కుమార్‌రెడ్డి, రాహిన్‌రెడ్డి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ప్రచారం చేస్తున్న గీతారెడ్డి, పూజారెడ్డి

• మేలు చేసిన వైఎస్సార్‌సీపీని ఆదరించండి

విడవలూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటా సంక్షేమ ఫలాలు అందాయని, రానున్న రోజుల్లో మరింత మేలు చేసేందుకు మీరు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ కోవూరు యువజన విభాగ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దంపూరు పంచాయతీలో శనివారం ఆయన ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందని, దీనిని చూసి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నల్లపరెడ్డి రాహిన్‌రెడ్డి, సర్పంచ్ ఇనగంటి సురేంద్రరెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పంచమూర్తి నారాయణ, ఎస్.శ్రీనివాసులు, ఎ.నాగేంద్ర, ఎస్.శీనయ్య, ఎమ్.చిరంజీవి, ఎమ్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు: రాష్ట్రాభివృద్ధికి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి అన్నారు. విడవలూరులోని యలగాలమ్మ గుంట, అరుంధతీయవాడలో శనివారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.ప్రవీణ్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.కృష్ణారెడ్డి, మురళీరెడ్డి, మధురెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రం కోసం..

కొడవలూరు: పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వర్ధిల్లాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేణుంబాక విజయసాయిరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిల విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని బసవాయపాళెంలో ఇంటింటి ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే పేదరికం అంతరించిపోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదరిక నిర్మూలనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. టీడీపీ ప్రజలను ప్రలోభ పెట్టి ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తోందన్నారు. అందువల్లే ప్రతిచోటా ధనవంతులకు టికెట్‌లిచ్చి బరిలోకి దింపిందన్నారు. ధనవంతులను నమ్మి మోసపోకుండా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెల్లేటి సతీష్‌రెడ్డి, దువ్వూరు అనిల్‌రెడ్డి, ఎస్.నందకుమార్ రెడ్డి, వీరి సంపత్‌కుమార్, ఓడూరు వెంకటేశ్వర్లురెడ్డి, సీహెచ్.కార్తీక్, మహిధర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే అజెండా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సతీమణి నల్లపరెడ్డి గీతారెడ్డి, కోడలు పూజారెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించారు. ప్రచారంలో స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టౌన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: బసవాయపాళెంలో ప్రచారం చేస్తున్న చలపతిరావు



విడవలూరు: యలగాలమ్మగుంటలో..

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండల పరిధిలో ఆదివారం ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈదూరు, సాయంత్రం 4 గంటలకు మండపం, 6 గంటలకు మాచర్లవారిపాళెం గ్రామాల్లో ప్రచారం సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వలంటీర్ల రాజీనామా

• జగనన్న విజయానికి కృషి చేస్తామని స్పష్టీకరణ



రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్‌లు

కొడవలూరు : మండలంలోని మిక్కిలింపేటకు చెందిన ఆరుగురు వలంటీర్‌లు రాజీనామా చేశారు. ఈ మేరకు వారి రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి బి.మధుసూదన్‌రావుకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి వద్దకే సేవలందించాలని జగనన్న తమకు వలంటీర్ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు ఇంటి వద్దకే పింఛన్‌లు అందించడంతో పాటు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సేవలందిస్తూ వచ్చామన్నారు. సేవే ప్రధానంగా పనిచేస్తున్న తమపై చంద్రబాబు రాజకీయ కక్షకట్టి సేవలను నిలిపి వేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన జగనన్నను ఈ ఎన్నికల్లో గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.